సాక్షి అనకాపల్లి

గురువారం । 20 । మార్చి । 2025



సడి లేని గిజిగాడు

8లో

వ్యవసాయదారులకు మేలు చేసే పిచ్చుకలు నేడు కానరావడం లేదు. సెల్‌టవర్ల రేడియేషన్ ప్రాణాంతకమై కనుమరుగవుతున్నాయి.



ఎరుకుమాంబకు జలాభిషేకం

సీతమ్మధార: విశాఖ దొండపర్తిలో కొలువుదీరిన ఎరుకుమాంబ అమ్మవారికి బుధవారం భక్తులు స్వహస్తాలతో జలాభిషేకం చేశారు.

రంజాన్ వేళలు

	ఇఫ్తార్	సహర్
	గురు	శుక్ర
అనకాపల్లి	6.12	4.46
నర్సీపట్నం	6.14	4.43

న్యూస్‌రీల్

ప్రశాంతంగా టెన్త్ హిందీ పరీక్ష

తుమ్మపాల: జిల్లాలో బుధవారం పదో తరగతి హిందీ పరీక్ష ప్రశాంతంగా జరిగింది. 107 కేంద్రాల్లో 20,774 మంది రెగ్యులర్ విద్యార్థులకు 20,670 మంది హాజరయ్యారని జిల్లా విద్యాశాఖాధికారి జి.అప్పారావునాయుడు తెలిపారు. 46 మంది ప్రైవేట్ విద్యార్థులకుగాను 26 మంది హాజరయ్యారని, మొత్తం 20,820 మందిలో 124 మంది పరీక్షకు హాజరు కాలేదన్నారు. జిల్లావ్యాప్తంగా మొత్తం 99.40 శాతం హాజరు నమోదైందన్నారు సార్వత్రిక విద్యాపీఠం ఆధ్వర్యంలో జిల్లాలో 7 పరీక్ష కేంద్రాల్లో జరిగిన 10వ తరగతి పబ్లిక్ పరీక్షకు 260 విద్యార్థులకుగాను 221 మంది విద్యార్థులు హాజరయ్యారని, 39 మంది హాజరు కాలేదన్నారు. రాష్ట్ర స్థాయి పరిశీలకులు, ఇంటర్మీడియట్ విద్యాశాఖ అదనపు సంచాలకులు పి.శ్రీనివాస్ 5, జిల్లా విద్యాశాఖాధికారి 7 పరీక్ష కేంద్రాలను తనిఖీ చేశారన్నారు. 7 స్క్వాడ్ బృందాలు 34 పరీక్ష కేంద్రాలను తనిఖీ చేశారన్నారు.

24, 25 తేదీల్లో బ్యాంకు ఉద్యోగుల సమ్మె



గోడపత్రికను ఆవిష్కరిస్తున్న సీఐటీయూ నాయకులు

తుమ్మపాల: ఈ నెల 24, 25 తేదీల్లో దేశవ్యాప్తంగా ప్రభుత్వ బ్యాంకుల ఉద్యోగులు చేపట్టే సమ్మెకు మద్దతిస్తూ సీఐటీయూ ఆధ్వర్యంలో గోడ పత్రిక ఆవిష్కరించినట్లు జిల్లా అధ్యక్షుడు ఆర్.శంకరరావు తెలిపారు. పట్టణంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం బ్యాంకుల్లో ఖాళీలను భర్తీ చేయడం లేదని, కొత్తగా భర్తీ చేసే ఉద్యోగాలను అవుట్ సోర్సింగ్ ప్రాతిపదికన నియమించాలని ప్రయత్నిస్తోందన్నారు. బ్యాంకుల సంఖ్యను తగ్గించి ఉద్యోగులపై పనిభారం విపరీతంగా పెంచుతుందని, పారిశ్రామికవేత్తల అప్పులు మాఫీ చేస్తూ బ్యాంకుల నెత్తిన భారం మోపుతుందని తెలిపారు. ఈ చర్యలకు నిరసనగా బ్యాంకు ఉద్యోగులు సమ్మె చేస్తున్నారన్నారు. ద్వైపాక్షిక ఒప్పందాలకు తూట్లు పొడుస్తున్న కేంద్ర ఆర్థిక మంత్రిత్వశాఖ ఆదేశాలను ఉపసంహరించాలని, పలు డిమాండ్లతో యూఎఫ్‌బీయూ నాయకత్వంలో ఉద్యోగులు, అధికారులు ఐక్యంగా సమ్మె చేస్తున్నారని తెలిపారు.

హాకీ జాతీయ జట్టులో యలమంచిలి క్రీడాకారిణి



లొట్ల మేరీ

యలమంచిలి రూరల్: పట్టణానికి చెందిన లొట్ల మేరీ హాకీ మహిళల సీనియర్ జాతీయ జట్టుకు ఎంపికయ్యారు. ఇటీవల జరిగిన ఎంపిక ల్లో హాకీ ఇండియా సెలెక్టర్లు ఆమెను జాతీయ జట్టు ప్రాబబుల్స్ జాబితాలోకి ఎంపిక చేశారు. దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాల నుంచి మొత్తం 65 మంది ప్రతిభావంతులైన మహిళా క్రీడాకారులను ఎంపిక చేశా రు. వీరందరికీ ఈ నెల 23 నుంచి 30 వరకు బెంగళూరు ఎస్ఏఐ కేంద్రంలో తర్ఫీదునివ్వను న్నారు. శిక్షణ అనంతరం 40 మంది క్రీడాకారి ణులను తుది జట్టులోకి ఎంపిక చేస్తారు. హాకీ మహిళల జాతీయ ప్రాబబుల్స్ బృందంలో ఏపీ నుంచి యలమంచిలికి చెందిన లొట్ల మేరీ మాత్రమే చోటు దక్కించుకున్నారు. పట్టణంలోని రైల్వేస్టేషన్ రోడ్డుకు చెందిన ద్విచక్రవాహనాల మెకానిక్ లొట్ల సంజీవి కుమార్తె మేరీ చిన్నప్పట్నుంచి హాకీలో విశేష ప్రతిభ కనబరుస్తూ వివిధ సందర్భాల్లో పతకాలు, బహుమతులు అందుకున్నారు. ఇదే క్రమంలో క్రీడల కోటాలో ఉత్తరప్రదేశ్ రాష్ట్ర పోలీసు శాఖలో ఉద్యోగం కూడా సాధించారు. హాకీ జాతీయ జట్టు ప్రాబబుల్స్ జాబితాలో స్థానం పొందిన మేరీని యలమంచిలి ఎమ్మెల్యే సుందరపు విజయ్‌కుమార్, యలమంచిలి మున్సిపల్ చైర్‌పర్సన్ పిల్లా రమాకుమారి, అనకాపల్లి జిల్లా హాకీ అసోసియేషన్ కార్యదర్శి కొఠారు నరేష్, పలువురు సీనియర్ హాకీ క్రీడాకారులు అభినందించారు.

జల కళ కలగా మిగిలేనా..?

- ఏలేరు-తాండవ ఎత్తిపోతల పథకంపై నీలినీడలు
- శ్రద్ధ చూపని కూటమి సర్కారు
- నెలలు గడుస్తున్నా పురోగతి శూన్యం
- ఆయకట్టు రైతుల్లో నైరాశ్యం



ఏలేరు కాలువ



తాండవ జలాశయం

నర్సీపట్నం: ఏలేరు-తాండవ ఎత్తిపోతల పథకంపై నీలినీడలు కమ్ముకున్నాయి. కూటమి ప్రభుత్వం కొలువుతీరి తొమ్మిది నెలలు దాటినా ఎత్తిపోతల పథకంపై ప్రభుత్వం ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు. చిరకాల స్వప్నం నెరవేరుతుందా లేదా అని ఆయకట్టు రైతులు మల్లగుల్లాలు పడుతున్నారు. తాండవ ప్రాజెక్టును 4,400 ఎంసీఎఫ్టీల నీటి నిల్వ సామర్థ్యంతో 1977లో నిర్మించారు. దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వై.ఎస్.రాజశేఖర్‌రెడ్డి హయాంలో రూ.50 కోట్లతో కాలువలు, జలాశయం ఆధునికీకరణ చేపట్టారు. వైఎస్సార్ పుణ్యమాని చివరి ఆయకట్టు భూములకు నీరు అందుతోంది. మాజీ సీఎం వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఒక అడుగు ముందుకేసి మరింత సస్యశ్యామలం చేసేందుకు ఏలేరు కాలువకు 68 కిలోమీటర్ల మేర లైనింగ్‌ను ఆధునికీకరించి ఎత్తిపోతల పథకాల ద్వారా రెండు పంటలకు సమృద్ధిగా నీరందించేందుకు రూ.470.05 కోట్లు కేటాయించారు. ఏలేరు ఇంజినీరింగ్ విభాగం సర్వే పూర్తి చేశారు. కొన్ని సాంకేతిక కారణాల వల్ల ప్రాజెక్టు నిర్మాణ పనులు చేపట్టడం ఆలస్యమైంది. ఇంతలో సార్వత్రిక ఎన్నికలు రావడంతో ఎత్తిపోతల పథకానికి బ్రేక్ పడింది. కూటమి ప్రభుత్వం కొలువు తీరింది. 20 శాతం కూడా పనులు పూర్తి కాని ప్రాజెక్టు వివరాలు ఇవ్వాలని ఆదేశించింది. ఎత్తిపోతల పథకాన్ని పర్యవేక్షిస్తున్న ఇంజనీరింగ్ అధికారులు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించారు. పథకం నిర్మాణంపై కూటమి ప్రభుత్వం ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు. ప్రాజెక్టు నిర్మాణంపై రైతాంగంలో సందిగ్ధత నెలకొంది.

ఈ ప్రాజెక్టు పూర్తయితే..

ఎత్తిపోతల పథకం పూర్తయితే.. అనకాపల్లి, కాకినాడ జిల్లాల పరిధిలోని ఆరు మండలాల రైతులకు మేలు చేకూరుతుంది. మొత్తం 77 గ్రామాల్లో 51,467 ఎకరాలకు సాగునీటికి ఢోకా లేకుండా, 5600 ఎకరాల కొత్త ఆయకట్టుకు నీరిచ్చేలా ఏలేరు ఎడమ కాలువపై నాలుగుచోట్ల ఎత్తిపోతల పథకాలను ఏర్పాటు చేసేందుకు గత ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. మొదటి ఎత్తిపోతల ద్వారా కోటనందూరుకు 135 రోజులు, రెండో ఎత్తిపోతల ద్వారా గొలుగొండపేటకు 135 రోజులు, మూడో ఎత్తిపోతల ద్వారా తాండవ కాలువకు 135 రోజులు, నాలుగో ఎత్తిపోతల ద్వారా గునిపూడి నుంచి తాండవ జలాశయానికి 90 రోజుల పాటు 200 క్యూసెక్కుల చొప్పున నీరు అందించేందుకు పథకాన్ని రూపొందించారు. ఇదే విధంగా ఏలేరు కాలువకు 68 కిలోమీటర్ల వరకు ఆధునికీకరణ, చింతలూరు వద్ద 1100 ఎకరాల కొత్త ఆయకట్టుకు 135 రోజులపాటు 25 క్యూసెక్కుల నీరు, అచ్చంపేట వద్ద 2100 ఎకరాలకు 25 క్యూసెక్కుల చొప్పున 135 రోజులపాటు 0.238 టీఎంసీల నీరు, ములపూడి ప్రాంతానికి 2400 ఎకరాలకు 25 క్యూసెక్కుల చొప్పున 135 రోజులపాటు 0.292 టీఎంసీల నీరు అందించేందుకు ఆలోచన చేశారు.

ఏలేరు-తాండవ జలాశయాల పరిధిలో ఆయకట్టు

అనకాపల్లి జిల్లాలో	34,518 ఎకరాలు
కాకినాడ జిల్లాలో...	16,947 ఎకరాలు
వీటి పరిధిలో చెరువులు:	198
చెరువుల కింద ఆయకట్టు:	17 వేల ఎకరాలు
జలాశయం నీటిమట్టం:	4,400 ఎంసీఎఫ్‌టీలు
ఎడమ ప్రధాన కాలువ పొడవు:	19.8 కిలోమీటర్లు
కుడి ప్రధాన కాలువ పొడవు:	15.4 కిలోమీటర్లు

రెండు జిల్లాలు సస్యశ్యామలం



రైతుల శ్రేయస్సు దృష్ట్యా ఏలేరు-తాండవ ఎత్తిపోతల పథకాన్ని ప్రభుత్వం కొనసాగించాలి. గత ప్రభుత్వంలో ఈ పథకానికి అడుగులు పడినప్పటికీ, పనులు ప్రారంభం కాలేదు. కూటమి ప్రభుత్వం ఎత్తిపోతల పథకానికి నిధులు కేటాయించి రైతులకు మేలు చేకూర్చాలి. ఈ పథకం పూర్తయితే రెండు జిల్లాలు సస్యశ్యామలవుతాయి. పథకాన్ని పూర్తి చేసి తాండవ జలాశయం ఆయకట్టు రైతుల చిరకాలను నెరవేర్చాలి.

–అడిగర్ల రాజు, సీఐటీయూ నాయకుడు

రైతులకు మేలు



ఒక్కొక్కసారి వాతావరణ ప్రతికూల పరిస్థితుల కారణంగా వర్షాలు పడకపోవటం వల్ల జలాశయంలో ఆశించిన స్థాయిలో నీటి నిల్వలు ఉండటం లేదు. పంటకు నీరు అందక ఇబ్బందులు తలెత్తున్నాయి. ఆయకట్టు రైతులకు భరోసా కల్పించేందుకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఎత్తిపోతల పథకానికి శ్రీకారం చుట్టింది. రాజకీయాలకు అతీతంగా కూటమి పథకాన్ని పూర్తి చేసి రైతులను ఆదుకోవాలి

–తాతాజీ, రైతు, మెట్టపాలెం

హతురాలు ఓ ట్రాన్స్‌జెండర్





ఎన్టీఆర్ హాస్పటల్ వద్ద హిజ్రాల ఆందోళన (ఇన్‌సెట్) హతురాలు దీపు (ఫైల్)

- అనకాపల్లిలో రెండు చోట్ల లభ్యమైన మిగతా శరీర భాగాలు
- సహజీవనం చేస్తున్న వ్యక్తిపైనే అనుమానం
- పోలీసుల అదుపులో నిందితుడు?

అనకాపల్లి టౌన్/కశింకోట/మునగపాక: బయ్యవరం వద్ద లభించిన శరీర భాగాలతో వెలుగు చూసిన వ్యక్తి హత్య కేసులో మిస్టరీ వీడింది. బుధవారం మరో రెండు చోట్ల మిగతా శరీర భాగాలు లభ్యం కావడంతో హత్యకు గురైన వ్యక్తిని ట్రాన్స్‌జెండర్‌గా గుర్తించారు. బయ్యవరం వద్ద జాతీయ రహదారి వంతెన కింద మంగళవారం ఒక చేయితోపాటు నడుం కింద శరీర భాగాలతో ఉన్న మూట దొరకడంతో గుర్తు తెలియని మహిళ హత్యగా భావించిన పోలీసులు వాటిని అనకాపల్లి ఎన్టీఆర్ ఆస్పత్రికి తరలించి భద్రపరిచిన సంగతి తెలిసిందే. ఏడు ప్రత్యేక పోలీసు దర్యాప్తు బృందాలు మృతదేహం మిగిలిన భాగాల కోసం గాలింపు చేపట్టాయి. అనకాపల్లిలో డైట్ కళాశాల వద్ద జాతీయ రహదారి పక్కన జలగల మదుం వద్ద కాలువలో హతురాలి తల భాగం, ఎడమ చేయి లభ్యమయ్యాయి. మండలంలోని తాళ్లపాలెం జాతీయ రహదారి వంతెన దిగువన మొండెం భాగం సంచిలో లభ్యమైంది. వీటిని పరిశీలించి హత్యకు గురైన వ్యక్తిని అనకాపల్లి గవరపాలెం ముత్రాసు కాలనీకి చెందిన మైపల దిలీప్ శివశంకర్ అలియాస్ దీపు (40)గా గుర్తించారు. ప్రత్యేక బృందాలు విచారిస్తున్నట్లు స్థానిక సీఐ అల్లు స్వామినాయుడు తెలిపారు. హత్యకు కారకునిగా భావిస్తున్న పశ్చిమ గోదావరి జిల్లా పెనుగొండకు చెందిన నిందితుడ్ని అదుపులోకి తీసుకొని హత్యకు గల కారణాలపై విచారిస్తున్నట్లు సమాచారం.

ఎనిమిదేళ్ల క్రితం వివాహం

పశ్చిమ గోదావరి జిల్లాకు చెందిన వ్యక్తితో 8 సంవత్సరాల క్రితం దీపు వివాహం చేసుకొని మునగపాక మండలం నాగులాపల్లి వద్ద నివాసముంటున్నారు. ఆనవాళ్లను బట్టి పోలీసులు మృతదేహాన్ని గుర్తించి నాగులాపల్లిలోని దీపు ఇంటికి క్లూస్ టీమ్‌ను తీసుకొని వెళ్లారు. గదిలో ఎటువంటి ఆనవాళ్లు లేకుండా నిందితుడు జాగ్రత్త పడినట్టు తెలిసింది. పోలీసులు నిందితులను పట్టుకోవడానికి ప్రయత్నిస్తున్న సమయంలో బుధవారం అనకాపల్లికి చెందిన హిజ్రాలందరూ తమ వర్గానికి చెందిన వ్యక్తి చనిపోయినట్లుగా గుర్తించి అనకాపల్లి ఎన్టీఆర్ ఆస్పత్రి వద్ద ధర్నాకు దిగారు. నిందితులను తక్షణమే ఎన్‌కౌంటర్ చేయాలని, లేనిపక్షంలో తమ సంఘానికి అప్పగించాలని ఎన్టీఆర్ ఆస్పత్రి నుంచి ర్యాలీగా నెహ్రూచౌక్‌కు చేరుకొని పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఈ సందర్భంగా హిజ్రాలు కొండబాబు, భారతమ్మలు మాట్లాడుతూ నిందితుడిగా అనుమానిస్తున్న వ్యక్తి, దీపు గత కొంతకాలంగా కలిసి ఉంటున్నారన్నారు. హత్య జరిగిన ముందు రోజు కూడా కలిసే ఉన్నారని తెలిపారు. గతంలో హిజ్రాలపై హత్యలు జరిగినప్పటికీ నేటి వరకూ పోలీసులు పట్టించుకోలేదని రోజురోజుకు హిజ్రాలపై దాడులు జరుగుతున్నాయన్నారు. అనంతరం నెహ్రూచౌక్ నుంచి ర్యాలీగా వచ్చి డీఎస్పీ శ్రావణితో హిజ్రాలు మాట్లాడారు.

చెరకు రైతులను నట్టేట ముంచారు..

- ప్రభుత్వ నిర్లక్ష్యంతోనే గోవాడ సుగర్ ఫ్యాక్టరీకి అధోగతి
- గిట్టుబాటు ధర కల్పించక, పేమెంట్లు చెల్లించక రైతన్న కష్టాలపాలు
- అసలే ఆలస్యం, తరచూ క్రషింగ్‌కు అంతరాయం
- సాగు చేసిన రైతే చెరకు పంటకు నిప్పు పెట్టిన దయనీయ స్థితి
- వైఎస్ జగన్ హయాంలో గోవాడ ఫ్యాక్టరీకి రూ.90 కోట్లు విడుదల
- మాజీ డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు



బాధిత రైతుతో కలిసి చెరకు పంటను పరిశీలిస్తున్న మాజీ డిప్యూటీ సీఎం ముత్యాలనాయుడు


దేవరాపల్లి: గోవాడ సుగర్ ఫ్యాక్టరీని, చెరకు రైతులను ఆదుకోవడంలో కూటమి ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని మాజీ డిప్యూటీ సీఎం, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు బూడి ముత్యాలనాయుడు విమర్శించారు. దేవరాపల్లి మండలం మేడిచెర్ల రెవెన్యూ పరిధిలో చెరకు పంటకు రైతు నిప్పు పెట్టిన పొలాన్ని బుధవారం ఆయన స్థానిక నాయకులతో కలిసి పరిశీలించారు. కొత్తపెంట గ్రామానికి చెందిన బాధిత రైతు రొంగలి వెంకటరావును ఆయన పరామర్శించి, అతడి కష్టాన్ని అడిగి తెలుసుకున్నారు. అనంతరం స్థానిక విలేకర్లతో మాట్లాడారు. కూటమి ప్రభుత్వ నిర్లక్ష్య ధోరణితో ఫ్యాక్టరీ ఎప్పుడు ఆగిపోతుందో తెలియని పరిస్థితికి దిగజారిందని విమర్శించారు. ఫ్యాక్టరీపై ఆధారపడి చెరకు సాగు చేసిన రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా మారిందన్నారు. జిల్లాకు కొత్త పరిశ్రమలు తెస్తామంటూ ప్రచారం చేస్తున్న కూటమి నేతలు, ముందు సహకార రంగంలో ఉన్న గోవాడ సుగర్ ఫ్యాక్టరీని కాపాడాలన్నారు. నవంబర్ నెలాఖరులో ప్రారంభించాల్సిన ఫ్యాక్టరీ క్రషింగ్‌ను సంక్రాంతి దాటాక ఆలస్యంగా ప్రారంభించడం నిర్లక్ష్యం కాదా అని ప్రశ్నించారు. అసలే ఆలస్యం.. ఆపై తరుచూ అంతరాయంతో రోజుల తరబడి కాటా వద్ద, ఫ్యాక్టరీ వద్ద చెరకు నిలిచిపోయి ఎండిపోవడంతో రైతులు నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలోనే యాజమాన్యం, ప్రభుత్వం తీరుపై ఆగ్రహించిన రైతులు ఇటీవల ఫ్యాక్టరీ వద్ద స్వచ్ఛందంగా ప్రత్యక్ష ఆందోళన చేశారన్నారు. తాజాగా ప్రభుత్వ తీరు పట్ల కలత చెందిన కొత్తపెంట రైతు తన చెరకు పంటకు తానే నిప్పు పెట్టుకున్నారని, ఈ ఘటనతోనైనా కూటమికి కనువిప్పు కలగాలని ఆకాంక్షించారు. చంద్రబాబు ఎప్పుడు గద్దెనెక్కినా అన్నదాతలకు అగచాట్లేనన్నారు. అధికారంలోకి వచ్చి తొమ్మిది నెలలు దాటినా అన్నదాత సుఖీభవ పేరిట రూ.20 వేలు పెట్టుబడి సహాయం ఊసెత్తకపోవడం రైతులను మోసగించడమేనన్నారు.

గోవాడను ఆదుకున్నది వైఎస్సార్, వైఎస్ జగన్‌లే..

2004లో నాటి సీఎం వైఎస్ రాజశేఖర్‌రెడ్డి టన్నుకు ఒకేసారి రూ.1100 గిట్టుబాటు ధర పెంచి గోవాడ రైతులకు అండగా నిలవగా, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రూ.90 కోట్లు విడుదల చేసి చెరకు రైతులను ఆదుకున్నారని ముత్యాలనాయుడు గుర్తు చేశారు. ఈ నేపథ్యంలోనే గత ఐదేళ్లలో రైతులు, కార్మికులు సుభిక్షంగా ఉన్నారన్నారు. ఇప్పటికైనా చెరకు రైతుల బకాయిలు చెల్లించేందుకు తక్షణమే రూ.35 కోట్లు విడుదల చేయాలని, ఫ్యాక్టరీ ఆధునికీకరణకు రూ.350 కోట్లు మేర మంజూరు చేయాలని మాజీ డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు డిమాండ్ చేశారు. ఆయన వెంట స్థానిక ఎంపీపీ చింతల బుల్లిలక్ష్మి, జెడ్పీటీసీ కర్రి సత్యం, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు బూరె బాబురావు, స్థానిక సర్పంచ్ రొంగలి వెంకటరావు (నీలిమ), ఎ.కొత్తపల్లి సర్పంచ్ చింతల సత్య వెంకటరమణ, మాజీ సర్పంచ్ రొంగలి శంకరరావు, రెడ్డి అప్పారావు ఉన్నారు.

కాలిన చెరకు సుగర్ ఫ్యాక్టరీకి తరలింపు

- కలెక్టర్ ఆదేశాలతో నరికించి తీసుకెళ్లిన ఫ్యాక్టరీ అధికారులు




కాలిన పంటను కూలీలతో నరికిస్తున్న ఫ్యాక్టరీ సిబ్బంది

దేవరాపల్లి: కొత్తపెంట రైతు రొంగలి వెంకటరావు నిప్పు పెట్టిన చెరకు పంటను కలెక్టర్ ఆదేశాలతో ఫ్యాక్టరీ సిబ్బంది బుధవారం నరికించుకొని తీసువెళ్లారు. కష్టపడి సాగు చేసిన చెరకు పంటకు గిట్టుబాటు ధర లభించకపోవడంతో కలత చెందిన రైతు తన పంటకు తానే నిప్పు పెట్టుకున్న సంగతి విదితమే. కాలిన పంటను పరిశీలించిన జాయింట్ కలెక్టర్ జాహ్నవి మిగిలిన పంటను నరికించి ఫ్యాక్టరీకి తరలించాలని గోవాడ సుగర్ ఫ్యాక్టరీ సిబ్బందికి ఆదేశించారు. ఈ నేపథ్యంలోనే ఫ్యాక్టరీ సిబ్బంది బుధవారం కూలీలను పెట్టి దగ్గరుండి నరికించి, కాలిపోగా మిగిలిన పంటను లారీలో ఫ్యాక్టరీకి తరలించారు. పంటకు సంబంధించి కటింగ్ ఆర్డర్‌ను సైతం బాధిత రైతు వెంకటరావు ఫ్యాక్టరీ వ్యవసాయ అధికారి కృష్ణమూర్తి అందజేశారు.

నిబంధనలు పాటించని క్వారీ వాహనాలు సీజ్

- అధిక లోడు, మితిమీరిన వేగానికి కళ్లెం
- కలెక్టర్ విజయ కృష్ణన్ ఆదేశం



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ విజయ కృష్ణన్

తుమ్మపాల: నిబంధనలు పాటించని క్వారీ వాహనాలను సీజ్ చేస్తామని కలెక్టర్ విజయ కృష్ణన్ హెచ్చరించారు. బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో అధికారులు, క్వారీలు, లారీల యజమానుల అసోసియేషన్లతో రోడ్డు ప్రమాదాలపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇటీవల కాలంలో క్వారీ లారీల వల్ల దారుణమైన ప్రమాదాలు జరిగి ప్రజలు ప్రాణాలు కోల్పోయారని, అధిక లోడుతో వెళ్లి రైల్వే అండర్ బ్రిడ్జిని ఢీకొనడంతో రైళ్ల రాకపోకలకు అంతరాయం కలిగిందని, ఇకముందు ఇటువంటివి జరిగితే వాహనాలు సీజ్ చేస్తామని హెచ్చరించారు. నిబంధనల ప్రకారం నడుచుకోకపోతే జిల్లాలో క్వారీ వాహనాలను పూర్తిగా నిలిపివేస్తామన్నారు. భారీ వాహనాలు నిబంధనల మేరకు మాత్రమే సరకులు తీసుకువెళ్లాలని, అధిక లోడు, మితిమీరిన వేగం అనుమతించబోమన్నారు. క్వారీలు ఉదయం నుంచి సాయంత్రం వరకు మాత్రమే పనిచేయాలన్నారు.

అధికారులే నియంత్రించాలి..

రాంబిల్లి నేవల్ బేస్, జాతీయ రహదారుల అధికారులు.. వారికి అవసరమైన మెటీరియల్ తీసుకుని అధిక లోడుతో వచ్చే వాహనాలను నియంత్రించాలని కలెక్టర్ ఆదేశించారు. అనుమతి లేని మైనింగ్‌పై విజిలెన్స్ దాడులు నిర్వహించాలని గనులశాఖ అధికారులను ఆదేశించారు. అక్రమ మైనింగ్ సమాచారం అందించని క్షేత్ర స్థాయి సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని రెవెన్యూ అధికారులకు చెప్పారు. అధిక లోడు, అధిక వేగం, రాంగ్ రూట్‌లో ప్రయాణించే వాహనాలపై చర్యలు తీసుకోవాలని పోలీసుశాఖ, రవాణాశాఖ అధికారులకు ఆదేశించారు. తీసుకున్న చర్యలపై వారం రోజులలో నివేదిక సమర్పించాలన్నారు. డీఆర్వో వై.సత్యనారాయణరావు, ఆర్డీవో షేక్ ఆయిషా, డీఎస్పీ వి.మోహనరావు, ఆర్డీవో మనోహర్, పంచాయతీ రాజ్ ఈఈ కె.వి.నాయుడు, మైన్స్ అండ్ జియాలజీ సహాయ సంచాలకుడు ఎం.శ్రీనివాసరావు, క్వారీలు, లారీల యజమానుల అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

'వైఎస్సార్' పేరు చూస్తే 'కూటమి'లో కలవరం

- ప్రతిచోటా ఆయన పేరును తొలగిస్తున్నారు
- ప్రజల గుండెల్లో మాత్రం ఆయన స్థానాన్ని చెరపలేరు
- విశాఖ స్టేడియానికి ఉన్న వైఎస్సార్ పేరు తొలగించడం దుర్మార్గం
- ఈనెల 20న స్టేడియం వద్ద వైఎస్సార్‌సీపీ నిరసన
- మీడియాతో మాజీమంత్రి అమర్‌నాథ్



మాట్లాడుతున్న గుడివాడ అమర్‌నాథ్

సాక్షి, విశాఖపట్నం : ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయిన దివంగత సీఎం వైఎస్ రాజశేఖర్‌రెడ్డి పేరును చూసి టీడీపీ కూటమి సర్కారు కలవరపడుతోందని వైఎస్సార్‌సీపీ విశాఖ జిల్లా అధ్యక్షుడు, మాజీమంత్రి గుడివాడ అమర్‌నాథ్ విమర్శించారు. రాష్ట్రంలో వైఎస్సార్ పేరు లేకుండా చేయాలనే దుర్మార్గమైన ఆలోచనతో కూటమి ప్రభుత్వం పని చేస్తోందని మండిపడ్డారు. అధికారంలోకి వచ్చినప్పటి నుంచి వైఎస్సార్ పేరు ఎక్కడ ఉంటే అక్కడ వరుసగా తొలగిస్తూ వస్తున్నారన్నారు. వైఎస్సార్ పేరు అయితే చెరిపేయగలరుగానీ.. ప్రపంచ వ్యాప్తంగా అభిమానుల గుండెల్లో ఉన్న ఆ పేరును చెరిపేయగలరా అని ప్రశ్నించారు. మద్దిలపాలెంలోని పార్టీ కార్యాలయంలో బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ ఏమన్నారంటే..

కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక వైఎస్సార్‌సీపీని లేకుండా చేయాలని.. వైఎస్సార్ అనే బ్రాండ్ కనిపించకుండా చేయాలన్న కుతంత్రమే కనిపిస్తోంది. నాగార్జున యూనివర్సిటీలోని వైఎస్సార్ విగ్రహాన్ని నేలమట్టం చేశారు.. బాపట్ల జిల్లా వేమూరులో వైఎస్సార్ విగ్రహానికి నిప్పంటించారు.. విజయవాడ హెల్త్ యూనివర్సిటీకి వైఎస్సార్ పేరును తీసేశారు.. వైఎస్సార్ జిల్లా పేరును మార్చేశారు.

జగన్ పేరునూ తీసేశారు..

ఇక వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సీఎంగా ఉండగా విజయవాడ నడిబొడ్డున 150 అడుగుల అంబేడ్కర్ విగ్రహం, మ్యూజియం నిర్మిస్తే దానిపైన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేరును తీసేశారు. వైఎస్సార్ పేరు కనపడితేనే ఓర్చుకోలేకపోతున్న చంద్రబాబు.. గతంలో మూడుసార్లు సీఎంగా పనిచేసి కూడా కృష్ణాజిల్లాకు ఎన్టీఆర్ పేరు ఎందుకు పెట్టలేకపోయారు? వైఎస్ జగన్ సీఎం అయ్యాకే ఎన్టీఆర్‌కు సమున్నత గౌరవం కల్పించారు. విశాఖ వీడీసీఏ క్రికెట్ స్టేడియానికున్న వైఎస్సార్ పేరును తొలగించడాన్ని వ్యతిరేకిస్తూ ఈనెల 20న స్టేడియం వద్ద శాంతియుతంగా నిరసన చేపడతాం.

క్లుప్తంగా

లేటరైట్‌పై నోరు మెదపరేం?

- స్పీకర్, ఎంపీ స్పందించాలి
- సీపీఎం నాయకుల డిమాండ్



మాట్లాడుతున్న సీపీఎం నాయకుడు అడిగర్ల రాజు

నర్సీపట్నం: లేటరైట్ తవ్వకాలపై వస్తున్న వార్త కథనాలపై కూటమి వైఖరి వెల్లడించాలని సీపీఎం నాయకుడు అడిగర్ల రాజు డిమాండ్ చేశారు. బుధవారం విలేకరులతో మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత నాతవరం మండలం, సుందరకోట పంచాయతీ భమిడికలొద్దులో లేటరైట్ తవ్వకాలకు సిద్ధమవుతున్నారని ప్రచారం జరుగుతోందన్నారు. స్థానిక ఎమ్మెల్యే, స్పీకర్ సిహెచ్.అయ్యన్నపాత్రుడు, ఎంపీ సీఎం రమేష్ దీనిపై స్పందించాలన్నారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు లేటరైట్ తవ్వకాలు, అక్రమాలపై ప్రశ్నించిన కూటమి నేతలు నేడు స్పందించాలన్నారు. అధికారంలో ఉన్న కూటమి నేతలు గిరిజనుల మనుగడకు, పర్యావరణానికి ప్రమాదం తలపెట్టే లేటరైట్ తవ్వకాలను వ్యతిరేకించి ప్రజల పక్షాన నిలబడాలన్నారు. బినామీల పేరున ఇచ్చిన మైనింగ్ అనుమతులు రద్దు చేయించాలన్నారు. గిరిజన చట్టాలను ఉల్లంఘించి లేటరైట్ తవ్వకాలకు పాల్పడడం తగదన్నారు. గిరిజన గ్రామాల్లో మౌలిక సౌకర్యాలు కల్పించి అభివృద్ధి చేయాలన్నారు. లేటరైట్ పేరుతో గిరిజనుల మనుగడకు విఘాతం కలిగిస్తే ప్రజల తరుపున ఉద్యమిస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో పార్టీ నాయకుడు చిరంజీవి పాల్గొన్నారు.

ఇంటర్ విద్యార్థిని అదృశ్యంపై ఫిర్యాదు



శాంతికుమారి

బుచ్చెయ్యపేట : మేజర్ పంచాయితీ వడ్డాదికి చెందిన ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న ముత్యాల శాంతికుమారి(17) అదృశ్యమైంది. ఈ నెల 15వ తేదీన ఇంటి నుంచి వెళ్లిన ఆమె తిరిగి ఇంటికి రాలేదని ఆమె తల్లిదండ్రులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్టు ఎస్ఐ శ్రీనివాసరావు తెలిపారు. విద్యార్థిని ఆచూకీ తెలిసిన వారు 9440904211 కు సమాచారం అందించాలని ఎస్ఐ కోరారు.

కేజీబీవీ పాఠశాలల్లో ప్రవేశాలకు దరఖాస్తులు

అచ్యుతాపురం రూరల్ : కేజీబీవీ పాఠశాలల్లో 6, 11 తరగతుల్లో ప్రవేశాలకు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చునని మండల విద్యాశాఖ అధికారి దేవరాయల్ అన్నారు. ఈ సందర్భంగా బుధవారం రాష్ట్ర సమగ్ర శిక్ష ఎస్పీడీ బి.శ్రీనివాసరావు కేజీబీవీల్లో ప్రవేశాల కోసం ఆన్‌లైన్ దరఖాస్తుల స్వీకరణకు ఆదేశాలు జారీ చేసినట్టు దేవరాయల్ తెలిపారు. 2025-2026 సంవత్సరానికి రాష్ట్రంలో 352 కేజీబీవీల్లో విద్యనభ్యసించేందుకు మార్చి 22 నుంచి ఏప్రిల్ 11వ వరకూ ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చునన్నారు. అనాథలు, బడి బయట పిల్లలు, బడి మానేసిన పేద పిల్లలు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, బీపీఎల్ బాలికలు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఆన్‌లైన్లో దరఖాస్తు చేసుకుంటున్న విద్యార్థులు మాత్రమే ప్రవేశాలకు పరిగణింపబడతారన్నారు. https://apkgbv.apcfss.in/ వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చునన్నారు. ఎంపికైన విద్యార్థులకు ఫోన్ మెసేజ్ ద్వారా సమాచారం అందుతుందన్నారు. మరిని వివరాలకు ఫోన్ నెంబర్లు 70751 59996, 70750 39990 కు సంప్రదించాలని కోరారు.

కిచ్ కిచ్..కిచ్..కిచ్..కిచ్‌కిచ్ ఈ శబ్దాలతో ఒకప్పుడు పట్టణాలు, గ్రామాలల్లో తెల్లవారేది. పొద్దున్నే లేచే సరికి ఇళ్ల ముందు పిచ్చుకలు చప్పుడు చేసుకుంటూ ఇంటా బయటా తిరిగేవి. ఇలా ఎక్కడ చూసినా కాకులు, పిచ్చుకల కిలకిలరావాలు ప్రకృతికి నిలయాలుగా నిలిచేవి. కానీ నేడు కాంక్రీట్ కీకారణ్యంలో పిచ్చుకలు రానురాను కనుమరుగవుతున్నాయి. పచ్చదనం కరువై, నీడ కరువవడంతో పాటు సెల్‌టవర్ల రేడియేషన్ కూడా పిచ్చుకలు అంతరించి పోవడానికి కారణంగా చెబుతున్నారు. జీవ వైవిధ్యం కాపాడుకునే దిశలో గ్రీన్‌క్లబ్ వంటి పర్యావరణ ప్రేమికులు పిచ్చుకల సంరక్షణకు కృషి చేస్తున్నారు.



సడి లేని గిజిగాడు...

కనుమరుగవుతున్న పిచ్చుకలు

చిన్ని పొట్టకు తిండి, గూడూ కరువే

నేడు పిచ్చుకల సంరక్షణ దినోత్సవం

అనకాపల్లి టౌన్ :

ఒకనాడు మనిషికి పిచ్చుక కూడా నేస్తమే. పిచ్చుకతో మనిషికి ఉన్న సంబంధం 10 వేల సంవత్సరాల నాటిది. మానవుడు వ్యవసాయం ప్రారంభించిన తొలి రోజులలో తమకు ఉపకరించే పశుపక్ష్యాదుల పట్ల శ్రద్ధ వహించేవారు. ప్రధానంగా మన ఇంటి పిచ్చుకగా పిలువబడే ఈ పక్షి తాటాకు ఇళ్ల చూరుల్లో గూళ్ళు పెట్టుకొని తమ సంతతిని వృద్ధి చేసుకొనేవి. అదే సమయంలో వ్యవసాయం మీద ఆధారపడి జీవించే వారంతా తమ ఇళ్ల చూరుకు ధాన్యం కుంకుల గుత్తులు వేలాడదీసేవారు. దీంతో పిచ్చుకలు ఆహారం తీసుకొని ఆ ఇంటి చుట్టుపక్కల కిచుకిచు మంటూ తిరుగుతుండేవి. పిచ్చుకలు పంటను ఆశించే క్రిమికీటకాలను తినడంలో ప్రముఖపాత్ర పోషిస్తాయి. నేడు పొలాల్లో చల్లే రసాయిన క్రిమి సంహారక మందులు పిచ్చుకలను వాటి తిండికి దూరం చేశాయి.

పిచ్చుకల సంరక్షణకు గ్రీన్ క్లబ్ సభ్యుల కృషి

గ్రీన్‌క్లబ్ వ్యవస్థాపకుడైన కొణతాల ఫణిభూషణ్ శ్రీధర్ వృత్తి రీత్యా ఉపాధ్యాయుడు. జంతు, వృక్ష ప్రేమికుడైన ఈయన పర్యావరణ పరిరక్షణలో ముందు ఉంటారు. గ్రీన్‌క్లబ్ అనే సంస్థను 2014 జూన్ ఐదున ప్రపంచ పర్యావరణ దినోత్సవం రోజు ప్రారంభించారు. చెట్లు పెంచాలని, పిచ్చుకలను రక్షించాలని గత 12 ఏళ్ల నుంచి పెద్ద ఉద్యమమే చేస్తున్నారు. కొంత నిధులు వెచ్చించి, సమీకరించి ఈ ప్రక్రియకు శ్రీకారం చుట్టారు. ప్రత్యేక కార్యక్రమాల ద్వారా వేసవి వచ్చిందంటే చాలు మట్టి పాత్రలకు బాటిళ్లను అమర్చి ఇంటి పరిసర ప్రాంతాలలోను, చెట్ల తొర్రలకు, వీటిని ఏర్పాటు చేస్తుంటారు. దేవాలయాల ఆవరణలో వరి కంకులను కడుతుంటారు. పక్షి జాతిని కాపాడుకుంటేనే మానవ మనుగడ బాగుంటుందని, మన పిచ్చుకను మనమే రక్షించుకుందాం అంటూ అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నారు.



పక్షులు నీరు తాగడం కోసం వాటర్ బాటిల్‌తో కూడిన మట్టిపాత్రలు పంపిణీ చేస్తున్న గ్రీన్‌క్లబ్ సభ్యులు (ఫైల్)



అవగాహన కార్యక్రమంలో గ్రీన్ క్లబ్ సభ్యులు



పక్షుల తిండి కోసం దేవాలయాల్లో వరి కంకులను కడుతున్న శ్రీధర్ మాస్టార్(ఫైల్)

జీవ వైవిధ్యం కాపాడుకోవాలి..



కొన్ని పక్షి జాతులు అంతరించిపోతే జీవవైవిధ్యం సమతుల్యం దెబ్బతినే ప్రమాదం ఉంది. మానవుడి ఆధునిక జీవన శైలి వల్ల, సౌండ్, ఎయిర్ పొల్యూషన్, సెల్‌టవర్స్ వల్ల పిచ్చుకలు కనుమరుగైపోయాయి. మానవ మనుగడకు పిచ్చుకల సంతతిని కాపాడుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

–భవానీ, ప్రధాన శాస్త్రవేత్త, కీటక విభాగం, ఆర్ఏఆర్ఎస్ అనకాపల్లి

పచ్చదనం లేక నీడ కరువై...



ఆధునికీకరణలో భాగంగా పచ్చని రావి, మర్రి చెట్లను నిర్ధాక్షణంగా తొలగించేశారు. పోనీ మానవుడు నిర్మిస్తున్న ఆకాశహర్మ్యాలలో కాస్తంత చోటు కూడా పక్షులకు లేకుండా పోయింది. వాటి గూడుకు కనీసం చెట్లు కూడా లేవు. చిన్ని పొట్టకు ఇంత తిండి కూడా దొరకని పరిస్థితి ఉంది. వాస్తవానికి పిచ్చుకలలో అనేక జాతులు ఉండేవి. పిచ్చుక జాతి అంతరించిపోవడానికి రేడియోధార్మికత విడుదల చేసే సెల్ టవర్లే ప్రధాన కారణంగా పర్యావరణవేత్తలు చెబుతున్నారు. దీనివల్ల పిచ్చుకలలో సంతానోత్పత్తి సామర్థ్యం దెబ్బతింటుంది. పిచ్చుకలు సాధారణంగా చెట్లు, పూరిపాకల పైకప్పు కింద గూళ్లు ఏర్పాటు చేసుకుంటాయి. ఇవి కనుమరుగు అయిపోవడంతో వీటి ఆవాసం కరువైంది.

స్పీకర్ అయితే ఎవరికి గొప్ప..!

- గౌరవం ఇచ్చి పుచ్చుకోవాలి
- లేట'రైట్ రైట్' అంటున్నారెందుకో!
- మాజీ ఎమ్మెల్యే ఉమాశంకర్ గణేష్



నర్సీపట్నం : స్పీకర్ అయితే ఎవరికి గొప్ప.. నీ పార్టీ నాయకులకు గొప్పేమో.. మాకేంటి అని మాజీ ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ స్పీకర్ అయ్యన్నపాత్రుడి తీరుపై తీవ్రస్థాయిలో మండిపడ్డారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ నూకాలమ్మ తల్లి గుడికి సంబంధించిన విరాళం విషయంపై 'గౌరవ స్పీకర్' అని అయ్యన్నపాత్రుడిని సంభోదిస్తే.. అయ్యన్నపాత్రుడు ఒక పోరంబోకు చేత తనపై విమర్శలు చేయించారన్నారు. తమకు గౌరవం ఇస్తే తాము గౌరవిస్తామన్నారు. స్పీకర్ అయితే ఎవరికి గొప్ప? అని ధ్వజమెత్తారు. 2019 డిసెంబరు తర్వాత టెండర్లు పిలిచి నూకాలమ్మ తల్లి గుడి కడితే తమ హయాంలో కట్టామని స్పీకర్ చెప్పుకోవడం సిగ్గుచేటన్నారు. ఇష్టం వచ్చినట్టు మాట్లాడితే ప్రజలు నమ్మే పరిస్థితి లేదన్నారు. రూ.10 లక్షలు సీఎంఆర్ అధినేత ఇస్తే ఆలయ చైర్మన్ ప్రతి పైసా గుడి కోసం ఖర్చు పెట్టారని, దానిపై అయ్యన్నపాత్రుడు ఆరోపణలు చేయడం ఏమిటని ప్రశ్నించారు. శ్మశానం సుందరీకరణకు సీఎంఆర్ అధినేత రూ.20 లక్షలు ఇస్తే దానిపై మాట్లాడరన్నారు. మీరు చేస్తే నీతి మేము చేస్తే అవినీతా? అని ప్రశ్నించారు.

ఏపీ టాక్స్...వసూళ్ల మాటేమిటో?

రోలుగుంట మండలంలో క్వారీల్లో లక్షల రూపాయలు దండుకుంటున్నారని విమర్శించారు. ఎవరని అడిగితే ఏపీ ట్యాక్స్ అంటున్నారని, త్వరలో ఏ అంటే ఏంటో..పీ అంటే ఏంటో బయటకు వస్తుందన్నారు. అనాడు అధికారంలోకి రాకముందు లేటరైట్ అడ్డుకుంటామని బిల్డప్ ఇచ్చారని, ఇప్పుడు లేటరైట్ రైట్ రైట్ అంటున్నారని మండిపడ్డారు. ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలు అమలు చేయకపోతే రాబోయే రోజుల్లో ప్రజలు తరిమి తరిమి కొడతారని అయ్యన్నపాత్రుడుని హెచ్చరించారు.

27న మాకవరపాలెం ఎంపీపీ ఎన్నిక

మాకవరపాలెం: ఈ నెల 27న ఎంపీపీ ఎన్నిక నిర్వహించనున్నట్టు ఎంపీడీవో సీతామహాలక్ష్మి బుధవారం తెలిపారు. ఎన్నికల కమిషన్ ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేసినట్టు చెప్పారు. మాకవరపాలెం ఎంపీపీ రుత్తల సత్యనారాయణ రాజీనామా చేసినందున ఎంపీపీ ఎన్నిక నిర్వహించనున్నారు. ఈనెల 23న నోటిఫికేషన్ జారీచేసి 27న ఎన్నికలు నిర్వహిస్తామన్నారు. ప్రస్తుతం వైస్ ఎంపీపీ రుత్తల లక్ష్మి ఎంపీపీగా కొనసాగుతున్నారు.

వరకట్న వేధింపులకు మహిళ బలి



కుమార్తె కుసుమ మృతితో రోధిస్తున్న తల్లి నాగమణి

కశింకోట: మండలంలోని కన్నూరుపాలెంలో భర్త, అత్తమామల వరకట్న వేధింపులు భరించలేక బావిలో పడి మహిళ ఆత్మహత్య చేసుకుంది. దీనిపై సీఐ అల్లు స్వామినాయుడు బుధవారం రాత్రి అందించిన వివరాలివి. కన్నురుపాలేనికి చెందిన పెయింటర్ గులిమి శివకు, గాజువాకకు చెందిన కుసుమ (25)కు 2019 ఫిబ్రవరి 13న వివాహం జరిగింది. ఆమెకు వివాహ సమయంలో రూ.2.50 లక్షల నగదు, ఐదు తులాల బంగారు ఆభరణాలు, బైక్ కట్నంగా ఇచ్చారు. వివాహం అనంతరం వారికి చరణ్ తేజ(5), యోక్సో వర్ధన్ (3) జన్మించారు. అయితే కొంత కాలంగా భర్త శివ, అత్త అమరావతి, మామ శ్రీనివాస్, బావ రామకృష్ణలు కలిసి రూ.లక్ష అదనపు కట్నం కోసం తరచుగా వేధిస్తూ మానసికంగా, శారీరకంగా వేధించసాగారు. వీటిని తాళలేక మంగళవారం సాయంత్రం కుసుమ సమీపంలోని బావిలో పడి మృతి చెందింది. ఈ మేరకు తండ్రి గోలుకొండ కొండబాబు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి మృతదేహాన్ని అనకాపల్లి ఎన్టీఆర్ ఆస్పత్రికి పోస్టుమార్టం నిమిత్తం తరలించినట్టు సీఐ తెలిపారు. కేసు దర్యాప్తులో ఉందన్నారు. ఇదిలా ఉండగా తన కుమార్తె కుసుమను అదనపు కట్నం కోసం అత్తింటి వారు వేధించి చంపేసారని ఆరోపిస్తూ పోలీసు స్టేషన్ వద్ద తల్లి నాగమణి రోధించగా బంధువులు ఓదార్చారు.

వాసవి కన్యకాపరమేశ్వరి ఆలయ వార్షికోత్సవం



ముషిడిపల్లి వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

దేవరాపల్లి: ముషిడిపల్లి వాసవి కన్యకా పరమేశ్వరీ పంచాయతన ఆలయ ప్రథమ వార్షికోత్సవం బుధవారం ఘనంగా జరిగింది. ఆలయ అర్చకులు సూర్యకుమార్ శర్మ తదితరుల మంత్రోచ్ఛారణల నడుమ అమ్మవారికి పంచామృతాభిషేకం జరిపారు. మండల వ్యాప్తంగా పలు గ్రామాల నుంచి తరలివచ్చిన భక్తులు 108 కలశాలతో అమ్మవారికి జలాభిషేకం చేశారు. ఆలయ ఆవరణలో హోమంతో పాటు అష్టోత్తర సామూహిక కుంకమార్చనలు జరిపారు. మహిళల కోలాట ప్రదర్శనలు, భజన కార్యక్రమాలతో సందడి నెలకొంది. మధ్యాహ్నం ఆలయ ఆవరణలో నిర్వహించిన భారీ అన్నసమారాధనకు అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి అమ్మవారి మహా ప్రసాదాన్ని స్వీకరించారు. పెదనందిపల్లి వాసవీ క్లబ్, వాసవీ కన్యకా పరమేశ్వరీ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఆలయ స్థల దాత రాయవరపు విజయలక్ష్మి పాల్గొన్నారు.

డివిజన్ లీగ్ విజేత మెజిస్టిక్ సీసీ



విజేత మెజిస్టిక్ సీసీ జట్టు సభ్యులు

విశాఖ స్పోర్ట్స్ : వీడీసీఏ నాల్గవ డివిజన్ క్లబ్స్ లీగ్ విజేతగా మెజిస్టిక్ సీసీ నిలిచింది. సీజన్‌లో ఆడిన ఏడు మ్యాచ్‌ల్లోనూ విజయంతో 28 పాయింట్లు సాధించి సత్తా చాటింది. జింక్ గ్రౌండ్‌లో జరిగిన మ్యాచ్‌లో టాస్ ఓడి తొలుత బ్యాటింగ్ చేసిన మెజిస్టిక్ సీసీ 184 పరుగులకు ఆలౌటైంది. ధీరజ్ 55 పరుగులు చేశాడు. ప్రతిగా గౌరీ యూత్ సీసీ 32 ఓవర్లలో 132 పరుగులకే ఆలౌటైంది. హేమచంద్ర నాలుగు వికెట్లు తీసి జట్టుకు విజయాన్నందించాడు.

అభివృద్ధి మాది...డప్పు మీది...?

- వై.ఎస్ జగన్ హయాంలోనే మైదాన, గిరిజన ప్రాంతాలకు రోడ్లు
- నాటి నిధులతో పనులు చేపడుతూ నేడు కొత్తగా మంజూరైనట్టు కూటమి నేతలు చెప్పడం సరికాదు
- మాజీ డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు



నూతనంగా నిర్మించిన గవరవరం–ఎ.కోడూరు తారురోడ్డు మీదుగా నడిచి పరిశీలిస్తున్న మాజీ డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు

దేవరాపల్లి: మాడుగుల నియోజకవర్గ చరిత్రలో ఎన్నడూ లేని విధంగా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి సహకారంతో మైదాన, గిరిజన అవాస ప్రాంతాలకు సైతం రోడ్డు సౌకర్యం కల్పించిన ఘనత తమకే దక్కుతుందని మాజీ డిప్యూటీ సీఎం, వైఎస్సార్‌సీపీ అనకాపల్లి జిల్లా అధ్యక్షుడు బూడి ముత్యాలనాయుడు స్పష్టం చేశారు. ఈ మేరకు గవరవరం నుంచి ఎ.కోడూరు వరకు నిర్మించిన తారురోడ్డును ఆయన బుధవారం పరిశీలించారు. గవరవరం–ఎ.కోడూరు రోడ్డుకు రూ. 2 కోట్లు, ఘాట్‌రోడ్డు–కింతలి రోడ్డుకు రూ. 9 కోట్లు నిధులను సీఎం జగన్ దృష్టికి తీసుకెళ్లి ఒకే ప్రొసీడింగ్‌లో మంజూరు చేయించానన్నారు. అప్పట్లో వర్షాకాలం, ఆ తర్వాత ఎన్నికల రావడంతో ప్రభుత్వం మారిందన్నారు. ఈ నేపథ్యంలోనే ప్రస్తుత కూటమి ప్రభుత్వం తాము మంజూరు చేసిన నిధులతో పనులు చేపడుతుందని, అయితే ఈ నిధులు కొత్తగా మంజూరు చేసినట్టు చెప్పుకోవడం సరికాదని హితవు పలికారు. గవరవరం–కాశీపురం రోడ్డు విస్తరణకు సైతం వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలోనే రూ. 20 కోట్లు మంజూరు చేసి 90 శాతం మేర కల్వర్టు పనులు సైతం పూర్తి చేశామన్నారు. మిగిలిన పనులను కూటమి ప్రభుత్వం పూర్తి చేస్తుందన్నారు. చింతలపూడి పంచాయతీ శివారు దట్టమైన అటవీ ప్రాంతంలో కొండలు, గెడ్డల మధ్య ఉన్న బోడిగరువు, నేరెళ్లపూడి గిరి గ్రామాలకు స్వాతంత్ర్యం వచ్చాక ఏ రాజకీయ నాయకుడు వెళ్లలేదన్నారు. డిప్యూటీ సీఎం హోదాలో సుమారు 5 కిలో మీటర్ల మేర కాలినడకన చేరుకొని వారి కష్టాలను స్వయంగా చూశానన్నారు. ఆయా గ్రామాలకు 25 అడుగుల వెడల్పున మట్టి రోడ్డు, కల్వర్టులు పూర్తి చేసి కారులో వెళ్లానని గుర్తు చేశారు. ఈ రోడ్డును రెండు వర్కులుగా విభజించి మట్టి రోడ్డుతో పాటు తారు రోడ్డు నిర్మాణానికి సైతం రూ. 3.50 కోట్లు నిధులు మంజూరు చేసినట్టు వివరించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో వారు పనులు చేపట్టడం శుభ పరిణామమేనని, అయితే ఆ నిధులు కొత్తగా మంజూరు చేసినట్టు ప్రచారం చేసుకొని మళ్లీ శంకుస్థాపన చేయడం విడ్డూరమని అన్నారు. ఈ వర్కులకు సంబంధించిన ప్రొసీడింగ్ సైతం తమ వద్ద ఉన్నాయని ఆయన చెప్పారు. తాను నాడు మంత్రి హోదాలో చేసిన అభివృద్ధిని చూస్తే సంతోషం కలుగుతుందన్నారు. ఆయన వెంట ఎంపీపీ చింతల బుల్లిలక్ష్మి, జెడ్పీటీసీ కర్రి సత్యం, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు బూరె బాబురావు, స్థానిక సర్పంచ్ రొంగలి వెంకటరావు, ఎ. కొత్తపల్లి సర్పంచ్ చింతల సత్య వెంకటరమణ ఉన్నారు.

మళ్లీ వడ్డాది వెంకన్న హుండీల లెక్కింపు

- బయటపడిన భక్తుడు సమర్పించిన బంగారం



ఆభరణాలను లెక్కిస్తున్న అధికారులు

బుచ్చెయ్యపేట: భక్తులు సమర్పించిన బంగారు, వెండి వస్తువుల వివరాలు వెల్లడించలేదని అభ్యంతరం వ్యక్తం కావడంతో వడ్డాది వేంకటేశ్వరస్వామి హుండీలను బుధవారం మరోసారి లెక్కించారు. ఈనెల 17వ తేదీన హుండీలను తెరిచి రూ.12,75,666 ఆదాయం వచ్చి నట్లు ఈవో శర్మ దేవస్థానం వంశ పారంపర్య ధర్మకర్త దొండా కన్నబాబు సమక్షంలో ప్రకటించారు. కేవలం డబ్బులు మాత్రమే ప్రకటించి బంగారు కానుకలు వెల్లడించకపోవడంపై వడ్డాదికి చెందిన భక్తుడు కె.రమణ అభ్యంతరం వ్యక్తం చేశారు. బంగారు వస్తువులు, వెండి వస్తువులు హుండీలో వేసి, నిలువు దోపిడీ చేశామని, ఆ వస్తువులు ఏమయ్యాయని వారు ప్రశ్నించారు. దీంతో బుధవారం దేవదాయశాఖ ఇన్‌స్పెక్టర్ వసంత, చీఫ్ ఎగ్జిక్యూటివ్ అధికారి మురళి, ఈవో శర్మలు హుండీలు తెరిచి ఆభరణాలను లెక్కించారు. ఈ ఏడాది ఉత్సవాల సందర్భంగా 13.5 గ్రాముల బంగారం,138 గ్రాముల వెండి వస్తువులు వచ్చినట్లు ప్రకటించారు. అలాగే గత 28 ఏళ్లలో కేజీ 600 గ్రాముల వెండి వస్తువులు, 0.8 గ్రాముల బంగారు వస్తువులు వచ్చినట్లు రికార్డుల్లో నమోదు చేశారు. దీంతో పలువురు భక్తులు అనుమానాలు వ్యక్తం చేశారు. గత 28 ఏళ్లలో వచ్చిన వస్తువులు ఇంతేనాఅని ప్రశ్నించారు. ఇకపై దేవస్థానంలో భక్తులు అందించిన కానుకలను సక్రమంగా వెల్లడించకపోతే పై అధికారులకు ఫిర్యాదు చేస్తామన్నారు.

చిత్తడి నేలలను పరిరక్షించుకోవాలి

తుమ్మపాల: జిల్లాలోని చిత్తడి నేలలను పరిరక్షించుకోవడానికి అధికారులు చర్యలు చేపట్టాలని కలెక్టర్ విజయకృష్ణన్ ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో 'చిత్తడి భూముల పరిరక్షణ, నిర్వహణ' అనే అంశంపై కలెక్టర్ అధ్యక్షతన జిల్లా స్థాయి సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ స్పేస్ అప్లికేషన్ సెంటర్ (ఎస్ఏసీ) నివేదిక ప్రకారం జిల్లాలో 951 చోట్ల చిత్తడి నేలలున్నాయన్నారు. వాటిలో సహజంగా ఏర్పడిన జలాశయలు ఎన్ని ఉన్నాయి..? మండలాల వారీగా చిత్తడి నేలల డేటాను సేకరించి నివేదికను ఇవ్వాలని డీఎఫ్ఓను ఆదేశించారు. చిత్తడి నేలలను పరిరక్షించాల్సిన బాధ్యత ఆయాశాఖల అధికారులపై ఉందన్నారు. ఇందుకోసం మండలస్థాయి కమిటీలను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. కమిటీ సభ్యులుగా తహసీల్దార్, ఫారెస్ట్ బీట్ ఆఫీసర్, నీటిపారుదల శాఖ ఇంజినీర్, ఈఓపీఆర్డి ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు ఈకార్యక్రమంలో ఆర్డీవోలు షేక్ అయిషా, వి.రమణ, జిల్లా అటవీశాఖ అధికారి ఎం.సామ్యూల్, జిల్లా ఉప అటవీ శాఖ అధికారి ఎ.సునీల్ కుమార్, జిల్లా ముఖ్య ప్రణాళిక అధికారి జి.రామారావు, జిల్లా సర్వే సహాయ సంచాలకులు ఎస్.రాజా గోపాల్, పట్టణ ట్రాఫిక్ డీఎస్పీ వి.మోహన్‌రావు, జిల్లా మత్స్యశాఖ అధికారి ప్రసాద్, అనకాపల్లి, యలమంచిలి, నర్సీపట్నం మున్సిపాల్ కమిషనర్లు, ఫారెస్ట్ రేంజర్లు పాల్గొన్నారు.

తహసీల్దార్‌పై చర్యలు తీసుకోవాలి



కోన బాబూరావు

అనకాపల్లి టౌన్ : అత్యాచారం కేసులో సస్పెండ్ అయి శిక్ష అనుభవించిన వారికి నిబంధనలకు విరుద్ధంగా రీజాయినింగ్ ఆర్డర్ ఇచ్చిన రెవెన్యు అధికారిపై చర్యలు తీసుకోవాలని ఆర్‌టీఐ విజిల్ బ్లోవర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కో కన్వీనర్ కోన బాబురావు కోరారు. గత సోమవారం కలెక్టర్ విజయకృష్ణన్‌కు పీజీపీఆర్ ద్వారా ఫిర్యాదు చేశారు. దీనిపై కలెక్టర్ సంబంధిత రెవెన్యూ అధికారులు విచారణకు ఆదేశించారు. ఈ సందర్భంగా కోన బాబురావు మాట్లాడుతూ కొరుప్రోలు గ్రామ వీఆర్ఏ చిన్నబ్బాయికి రీజాయినింగ్ ఆర్డర్ ఇచ్చిన, అవినీతి, అక్రమాలతో ప్రభుత్వ నిబంధనలకు వ్యతిరేకంగా లింగరాజుపాలెం వీఆర్ఏగా చిందాడ సత్యనారాయణకు ఉద్యోగం ఇచ్చిన గత తహసీల్దార్ విజయ్‌కుమార్‌పై సమగ్ర దర్యాప్తు చేసి చర్యలు తీసుకోవాలి కోరారు. కొరుప్రోలు వీఆర్ఏ చిన్నబ్బాయిపై 2023 ఏడాది డిసెంబర్ 11న ఎఫ్ఐఆర్ నెం.445/2023 సెక్షన్ ఐపీసీ 376(2)ఎన్ కింద అత్యాచారం కేసు నమోదైందని పేర్కొన్నారు. దీంతో రిమాండ్ నిమిత్తం 3 నెలల కాలంలో సస్పెండ్ అయి మూడు నెలలు జైలు శిక్ష అనుభవించారని, గుట్టు చప్పుడు కాకుండా డబ్బులు తీసుకుని అతనికి రీజాయినింగ్ ఆర్డర్ ఇచ్చారని తెలిపారు. అదేవిధంగా లింగరాజుపాలెం వీఆర్ఏ చిందాడ అప్పారావు మరణాంతరం ఆయన కుమారుడికి వీఆర్ఏ ఉద్యోగం అర్హత లేకున్నా సత్యనారాయణకు అర్హత లేకున్నా..46 ఏళ్లు ఉన్న ఆయనకు ఉద్యోగం ఇచ్చారని, తొలుత అర్హత లేకపోవడంతో తిరస్కరించిన తరువాత కూడా ఆర్ఐ వినయ్, సీనియర్ అసిస్టెంట్ మణికంఠ లంచం తీసుకుని అప్పటి తహసీల్దార్ విజయకుమార్ ద్వారా ఉద్యోగాలు కల్పించారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఇప్పటికే రెండుమూడు సార్లు అధికారులకు ఫిర్యాదు చేసినా తహసీల్దార్‌పై చర్యలు తీసుకోలేదని, తక్షణమే వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు.

క్లుప్తంగా

నూతన కమిటీ ఎన్నిక



నూతన కమిటీని సత్కరిస్తున్న అసోసియేషన్ సభ్యులు

అనకాపల్లి టౌన్: ఆంధ్రప్రదేశ్ విద్యుత్ ఎంప్లాయీస్ యూనియన్ పట్టణ బ్రాంచ్ అధ్యక్షుడిగా పడాల సోమన్నదొర ఎన్నికయ్యారు. స్థానిక వివేకానందా చారిటబుల్ ట్రస్ట్ హాల్లో యూనియన్ సర్వసభ్య సమావేశం మంగళవారం రాత్రి జరిగింది. ఈ సమావేశంలో కార్యదర్శిగా నూకరాజు, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా పేరపు వెంకట రాంబాబు, ఆర్గనైజింగ్ సెక్రటరీలుగా ఒ. శ్రీనివాసరావు, సీహెచ్‌వీ సత్యనారాయణ, ఆఫీస్ సెక్రటరీగా సీహెచ్‌వీవీ కుమార్, కోశాధికారిగా వెంపల శంకర్రావు, ఉపాధ్యక్షుడిగా కరణం ఈశ్వరావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ఐదు జిల్లాల యూనియన్ సెక్రటరీ వీఎస్ఆర్‌కే గణపతి మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా విద్యుత్ శాఖలో ఖాళీగా ఉన్న పోస్టులు భర్తీ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో రీజినల్ ఉపాధ్యక్షుడు చవితిని నర్సింగరావు తదితరులు పాల్గొన్నారు.

40 ఏళ్లు దాటాక గుండె పరీక్షలు తప్పనిసరి

అనకాపల్లి టౌన్: ఛాతీలో వచ్చే నొప్పి గ్యాస్ నొప్పి అని నిర్లక్ష్యం చేకుండా పరీక్షలు చేయించుకోవాలని గుండె వైద్యులు వాసుబాబు సూచించారు. స్థానిక వివేకానంద ట్రస్ట్ భవనంలో ఉత్తరాంధ్ర గ్రామీణ వైద్యుల సంఘం ఆధ్వర్యంలో కిమ్స్ ఐకాన్ హాస్పిటల్ సహకారంతో వైద్య అవగాహన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 40 ఏళ్లు దాటిన ప్రతి ఒక్కరూ గుండె పరీక్షలు చేయించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ నితీష్‌రెడ్డి, జంగం జోషి, అల్లాడ త్రినాథరావు, ఎం. కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

వివిధ పనుల నిర్వహణకు టెండర్లు ఖరారు



పంచాయతీ కార్యాలయంలో నిర్వహిస్తున్న టెండర్ల కార్యక్రమం

కశింకోట: పంచాయతీ కార్యాలయంలో బుధవారం వివిధ పనుల నిర్వహణకు టెండర్లు పిలిచి వాటిని ఖరారు చేశారు. సర్పంచ్ మంత్రి జయరజని, పంచాయతీ కార్యదర్శి రామచంద్రరావు సమక్షంలో ఈ కార్యక్రమం జరిగింది. పారిశుధ్యం, ఎలక్ట్రికల్ పనుల నిర్వహణను కాంట్రాక్టుపై నిర్వహించడానికి, శానిటరీ సామాన్లు సమకూర్చడానికి టెండర్లు వేసిన మేరకు పరిశీలించి తీవ్ర పోటీ మధ్య వాటిని కేటాయించారు. కూటమి నాయకుల కనుసన్నల్లో ఈ ప్రక్రియ జరిగింది. బీజేపీ జిల్లా అధ్యక్షుడు ద్వారపురెడ్డి పరమేశ్వరరావు, మండల పరిషత్ మాజీ ఉపాధ్యక్షుడు వేగి గోపీకృష్ణ, జనసేన నాయకుడు దాసరి బాబు తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

నేడు మండల పరిషత్ కార్యాలయంలో ప్రజావేదిక

అనకాపల్లి టౌన్: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం ప్రజావేదిక కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు మండల పరిషత్ అభివృద్ధి అధికారి తెలిపారు. 1.04.2023 నుండి 31.03.2024 మధ్య కాలంలో ఉపాధి హామీ పథకం ద్వారా ఖర్చు పెట్టిన నిధుల వివరాలు తదితర అంశాలపై చర్చించేందుకు ప్రజావేదిక కార్యక్రమం చేపట్టినట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమానికి పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లు, వెలుగు, హౌసింగ్, పీఆర్, వెటర్నరీ, ఫారెస్ట్ సిబ్బంది హాజరు కావాలని తెలిపారు.

బెల్లం ధరలు



అనకాపల్లి బెల్లం మార్కెట్‌కు బుధవారం 5,004 దిమ్మలు వచ్చాయి.

దిమ్మల రకం	కనిష్ట ధర	గరిష్ట ధర
స్పెషల్ రకం	3,900	4,570
మొదటి రకం	3,700	4,050
రెండో రకం	3,300	3,870
మూడో రకం	2,850	3,180

అనకాపల్లి సినిమాలు

రిటర్న్ ఆఫ్ ది డ్రాగన్	:రాజా
ఆఫీసర్ ఆన్ డ్యూటీ	: సత్యనారాయణ స్క్రీన్-1
యుగానికి ఒక్కడు	:సత్యనారాయణ స్క్రీన్-2
కోర్ట్	:పర్తిసాయి
దిల్‌రూబా	:షిర్డీసాయి
థౌజండ్ వాలా	:వెంకటేశ్వర(ఉదయం)
న్యూ పోలీస్ స్టోరీ	:వెంకటేశ్వర (మ్యాట్నీ, 1,2 షోలు)
తండేల్	:శ్రీసత్య
ఛావా	:రామచంద్ర

రక్త నిల్వలు

అనకాపల్లి: జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 58 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఏ పాజిటివ్-10 యూనిట్లు, బీ పాజిటివ్-18 యూనిట్లు, ఓ పాజిటివ్-24 యూనిట్లు శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్‌బ్యాంకు టెక్నీషియన్ యు.లోకేష్‌ను 9703619706 నంబరులో సంప్రదించవచ్చు.

పైకమందదు.. పొయ్యి వెలగదు

- ఉపాధి కూలీలకు నెలల తరబడి అందని కూలి డబ్బులు
- ఇల్లు గడవక ఇబ్బంది పడుతున్నామని ఆవేదన
- నిధులు విడుదలైతే చెల్లిస్తామంటున్న అధికారులు



పరవాడపాలెంలో ఇంకుడు గుంత తవ్వకం పనుల్లో ఉపాధి కూలీలు



జెట్టుపురెడ్డితునిలో ఇంకుడు గుంత తవ్వుతున్న కూలీలు

కశింకోట: మండలంలో జాతీయ ఉపాధి హామీ పథకం పనులు నిర్వహించిన కూలీలు సొమ్ము కోసం ఎదురు చూస్తున్నారు. రెండు నెలలకు పైగా వారికి కూలీ చెల్లించలేదు. దీంతో ఇబ్బంది పడుతున్నామని వారు వాపోతున్నారు. నిధులు విడుదల కాకపోవడంతో చెల్లింపులు జరగలేదని అధికారులంటున్నారు. మండలంలో 2024-25 ఆర్థిక సంవత్సరంలో రూ.13 కోట్ల పైబడి ఉపాధి పనులు నిర్వహించాలని లక్ష్యం నిర్దేశించుకోగా దాన్ని అధిగమించి పనులు నిర్వహించారు. అయితే ఈ ఏడాది జనవరి 9 నుంచి ఇప్పటి వరకు కూలీ సొమ్ము చెల్లింపులు జరగలేదు. సుమారు 1900 మంది కూలీలకు రూ.కోటి 68 లక్షల మేర కూలీ చెల్లించాల్సి ఉంది. వీరు కందకాలు, సాగు నీటి కాలువ పనులు, చెట్లకు పాదె తవ్వడం వగైరా పనులు చేస్తున్నారు. కుటుంబ జీవనానికి ఇబ్బంది పడుతున్నామని కూలీలు ఆవేదన చెందుతున్నారు. అలాగే ఉపాధి పథకంలో 23 మినీ గోకులం షెడ్లు నిర్మించగా, వీటికి సుమారు రూ.30 లక్షల వరకు చెల్లించాల్సి ఉంది. వీటి చెల్లింపులు జరగక పాడి రైతులు సతమతమవుతున్నారు. కూలీ చెల్లింపులో జాప్యం జరుగుతున్నప్పటికీ ఉపాధి పనులకు కూలీలు వెళ్లక తప్పడం లేదు. ఎప్పటికైనా వస్తుందని ఆశించి పనికి వెళ్తున్నారు.

ఇంకుడు గుంతల నిర్మాణం..

పండ్ల తోటల్లో ప్రస్తుతం ప్రభుత్వం ప్రాధాన్యం ఇచ్చిన మేరకు పంట సంజీవిని పేరిట ఫారం పాండ్స్ (ఇంకుడు గొయ్యిలు) తవ్వకం పనులు జరుగుతున్నాయి. సోమవరం, తాళ్లపాలెం, జి. భీమవరం, అడ్డాం, చెరకాం, ఉగ్గినపాలెం, బయ్యవరం, జమాదులపాలెం, జెట్టుపురెడ్డితుని, పరవాడపాలెం తదితర గ్రామాల్లో వీటి పనులు జరుగుతున్నాయి. ఈ నెలఖరులోగా 90 పాండ్లు తవ్వాలని లక్ష్యంగా నిర్దేశించారు. ఒక్కొక్క ఇంకుడు గుంత తవ్వకానికి రూ.60 వేల వరకు అయ్యే ఖర్చు ఉపాధి పథకంలో సమకూర్చనున్నారు. అందుబాటులో ఉన్న భూమి విస్తీర్ణాన్ని అనుసరించి దీన్ని పది మీటర్ల పొడవు, వెడల్పుతో పాటు రెండు మీటర్ల లోతుతో తవ్వుతున్నారు. అనంతరం దాని చుట్టూ రాయి పేరుస్తారు. దీనిలో వర్షం పడినప్పుడు నీరు చేరి నిల్వ ఉండటం వల్ల ఆయా ప్రాంతంలోని పండ్ల తోటలు, చెట్లు, కూరగాయలు పండించుకోవడానికి, పండ్ల జాతి మొక్కలు నాటుకోవడానికి ఉపయోగపడనుంది. దీంతో రైతులు ఆసక్తిగా వీటిని జీడి మామిడి, మామిడి తోటల్లో తవ్వించుకుంటున్నారు. వచ్చే ఏప్రిల్ 1 నుంచి 2025-26వ సంవత్సరం నిర్వహించాల్సిన పనులు ప్రారంభం కానున్నాయి. దీనిలో కూడా ఫారం పాండ్ల తవ్వకానికి ప్రాధాన్యం ఇవ్వాలని, ఒక్కొక్క పంచాయతీ పరిధిలో 20 పాండ్లు తవ్వాలని, జూన్ నెలాఖరులోగా వాటిని పూర్తి చేయాలని ప్రభుత్వం నిర్దేశించింది.

లక్ష్యాన్ని మించి పనులు

ఉపాధి పథకంలో లక్ష్యాన్ని మించి ఈ ఏడాది పనులు జరిగాయి. రూ.14.25 కోట్ల పనులు నిర్వహించడం లక్ష్యంగా నిర్ణయించగా వాటిని అధిగమించి రూ. 14.36 కోట్ల మేర పనులు జరిగినట్లు సమాచారం. 4.75 లక్షల పని దినాలు కాగా, 5.15 లక్షల పని దినాలు జరిగాయి. వీటిలో రూ.12.68 కోట్ల మేర కూలీలకు చెల్లింపులు చేశారు.



కన్నూరుపాలెంలో నిర్మించిన మినీ గోకులం షెడ్డు

కొన్ని గ్రామాలకే ఉపాధి పనులు..

ప్రస్తుతం మండలంలోని దాదాపు సగం గ్రామాల్లో మాత్రమే ఉపాధి పనులు జరుగుతున్నాయి. కశింకోట, వెదురుపర్తి, పేరంటాలపాలెం, కొత్తపల్లి, బుచ్చియ్యపేట తదితర గ్రామాల్లో పనులు నిర్వహించడం లేదు. దీంతో ఉపాధి కూలీలు పనులు లేక ఆయా గ్రామాల్లో ఇబ్బంది పడుతున్నారు. అయితే కుటుంబానికి వంద రోజుల పని దినాలు, నిర్దేశించిన పనులు పూర్తి కావడంతో ఆయా గ్రామాల్లో పనులు నిర్వహించలేదు. వచ్చే ఏప్రిల్ నుంచి అన్ని గ్రామాల్లో ఉపాధి పనులు చేపట్టి నిర్వహిస్తామని అధికారులంటున్నారు. సరాసరి ఒక్కొక్కరికి రూ.281 వరకు రోజు కూలీ చెల్లిస్తున్నామంటున్నారు.

పనులు చేపట్టలేదు..



కశింకోటలో ఈ ఏడాది ఉపాధి పనులు ఇంకా చేపట్టలేదు. దీంతో ఉపాధి లేక ఇబ్బంది పడుతున్నాం. ఉపాధి పనులు చేపట్టడానికి అధికారులు చర్యలు తీసుకుని ఉపాధి కల్పించాలి.

– ఆళ్ల పూర్ణమ్మ, ఉపాధి కూలీ, కశింకోట.

కూలీ చెల్లించేందుకు చర్యలు

ఉపాధి కూలీలకు రూ.కోటి 68 లక్షల కూలీ ఈ నెల జనవరి 9 నుంచి చెల్లించాల్సి ఉంది. కేంద్రం నుంచి నిధులు రాగానే వీటిని చెల్లించడానికి చర్యలు తీసుకుంటాం. పంట సంజీవని కింద సుమారు 15 గ్రామాల్లో ఫారం పాండ్ల నిర్మాణ పనులు జరుగుతున్నాయి. ప్రభుత్వం ప్రాధాన్యం ఇచ్చిన మేరకు వీటిని రానున్న జూన్ నెలాఖరులోగా అన్ని గ్రామాల్లో గ్రామానికి 20 వంతున ఫారం పాండ్ల నిర్మాణానికి చర్యలు చేపడతాం. వంద రోజులు పని దినాలు, నిర్దేశించిన పనులు పూర్తి అయిన గ్రామాల్లో ఉపాధి పనులు నిర్వహించడం లేదు. ఏప్రిల్ నుంచి అన్ని గ్రామాల్లో పనులు చేపడతాం.

– ఎం. శ్రీనివాసరావు, ఏపీఓ, కశింకోట.

రైతులకు రాయితీపై వ్యవసాయ పనిముట్లు

కశింకోట: రైతులకు ఎస్ఎంఏఎం పథకం ద్వారా రాయితీపై వ్యవసాయ పనిముట్లు అందించనున్నట్లు మండల వ్యవసాయ అధికారి ఎం. స్వప్న తెలిపారు. మండలంలోని తాళ్లపాలెంలో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అక్కడి నువ్వు పంట సాగును పరిశీలించారు. ప్రస్తుతం పూత దశలో ఉన్న నువ్వుపై చేపట్టాల్సిన సస్యరక్షణ చర్యలపై రైతులకు పలు సూచనలు చేశారు. అనంతరం సచివాలయంలో భూ ఆధార్ నమోదు కార్యక్రమాన్ని పరిశీలించారు. ప్రతి రైతు భూ ఆధార్ నమోదు తప్పనిసరిగా చేసుకోవాలని, ప్రభుత్వం నుంచి వచ్చే రాయితీలు పొందాలన్నారు. వీఏఏ సన్యాసి నాయుడు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

దేవాలయాల్లో వృద్ధులకు ఉచిత దర్శనం కల్పించాలి

అనకాపల్లి టౌన్: ఉత్తరాంధ్రలో పేరుగాంచిన నూకాంబికా అమ్మవారి దేవాలయంలో వృద్ధులకు ఉచితంగా దర్శనం కల్పించాలని జిల్లా వయోవృద్ధుల సంక్షేమ సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు కాండ్రేగుల అప్పారావు అన్నారు. స్థానిక రైతుభారతిలో బుధవారం జరిగిన వయోవృద్ధుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ 60 సంవత్సరాలు పైబడిన వారందరికీ దేవాలయాల్లో ఉచితంగా దర్శనం కల్పించాలని ఆయన కోరారు. ఈ సమావేశంలో బీశెట్టి కృష్ణ అప్పారావు, ఎంఎస్ఎన్ అప్పారావు, బుద్ద తాతారావు తదితరులు పాల్గొన్నారు.

కార్పొరేషన్ రుణాలకు 22లోగా దరఖాస్తు చేసుకోవాలి

మునగపాక: ఈనెల 22 లోగా బీసీ, ఈబీసీ, కాపు కార్పొరేషన్ ద్వారా రుణాలు మంజూరు చేసేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఎంపీడీవో ఎం.ఉషారాణి తెలిపారు. బుధవారం ఆమె విలేకరులతో మాట్లాడారు. 2024-25 సంవత్సరానికి ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలని చెప్పారు. కార్పొరేషన్ల ద్వారా అర్హులైన వారికి రుణాలు మంజూరు చేసేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతుందన్నారు. యూనిట్‌ను బట్టి రాయితీ సదుపాయం ఉంటుందన్నారు. ప్రతి ఒక్కరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వివరాలకు మండల పరిషత్ కార్యాలయంలో సంప్రదించాలని ఉషారాణి తెలిపారు.

వేలం పాటల ద్వారా రూ. 57 వేల ఆదాయం



తాళ్లపాలెం పంచాయతీలో నిర్వహిస్తున్న సంతల ఆశీల్ల వేలం పాట

కశింకోట: మండలంలోని తాళ్లపాలెం పంచాయతీలో బుధవారం నిర్వహించిన సంతల ఆశీల్ల వేలం పాటలో రూ.57 వేల ఆదాయం అదనంగా పెరిగింది. ఈవోపీఆర్డీ ఎం. వెంకటలక్ష్మి, పంచాయతీ కార్యదర్శి ఎస్. సత్యారావు సమక్షంలో వారపు సంతకు 2025-26 సంవత్సరానికిగాను వేలం పాట నిర్వహించారు. రూ.7.98 లక్షలకు వేలం పాట పాడుకున్నారు. ఇది గత ఏడాదితో పోలిస్తే రూ.57 వేలు ఎక్కువ. గత ఏడాది రూ.7.41 లక్షల ఆదాయం లభించింది. అలాగే రోజు వారీ సంతకు వేలం పాట నిర్వహించగా రూ.60 వేలకు పాడారు. ఇది గత ఏడాదితో పోలిస్తే రూ.3 వేలు ఎక్కువ. గత ఏడాది రూ.57 వేల ఆదాయం లభించింది. ఈ పాటలను ఎక్కువకు పాడిన గల్లా నాగమణికి ఆశీల వసూలు ఖరారు చేశారు. సర్పంచ్ రెల్లి నాగయ్యమ్మ, బీజేపీ నాయకుడు గల్లా రాజు, కూటమి నాయకులు కర్రి గోవింద, చిన్ని కోటేశ్వర రావు తదితరులు పాల్గొన్నారు.

నేడు విఘ్నేశ్వర స్వామి ఆలయ వార్షికోత్సవం

మునగపాక: స్థానిక సంతబయిల పురాతన విఘ్నేశ్వర స్వామి ఆలయ వార్షికోత్సవం గురువారం ఘనంగా నిర్వహిస్తున్నట్లు ఆలయ చైర్మన్ మండపాటి శ్రీ రామ వెంకట నరసింగరావు (రాము) ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం నుంచి ఆలయ ప్రాంగణంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చి తీర్థ ప్రసాదాలు స్వీకరించాలని ఆయన కోరారు.

సర్వేలతో ప్రజలకు మేలు



పంచాయతీ కార్యదర్శులతో మాట్లాడుతున్న ఎంపీడీవో సీతారామరాజు



సర్వే తీరును పరిశీలిస్తున్న ఎంపీడీవో రాజు

పాయకరావుపేట: మండలంలోని వివిధ గ్రామాల్లో జరుగుతున్న పి-4 సర్వేని విజయవంతం చేయాలని ఎంపీడీవో సీతారామరాజు అన్నారు. బుధవారం ఆయన పలు గ్రామాల్లో సర్వేను పరిశీలించారు. సర్వే వల్ల ప్రజలకి ఎంతో మేలు జరుగుతుందన్నారు. ప్రభుత్వం అమలు చేసే పథకాలు పొందాలంటే ఈ సర్వేలో నమోదు అయి ఉండాలన్నారు. ప్రతి ఒక్కరూ అధికారులకు సమగ్ర సమాచారం అందజేయాలన్నారు. కార్యదర్శులు నిర్దేశించిన గడువులోగా ఈ కార్యక్రమాన్ని పూర్తి చేయాలన్నారు. అనంతరం ఆయన దోసలపాడు డొంకాడ గ్రామాల్లో ప్రత్యేక ఆధార్ క్యాంపులను పరిశీలించారు. ఆధార్‌లో తప్పు ఒప్పులను సరి చేసేందుకు నిర్వహిస్తున్న ఈ క్యాంపులను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి మూర్తి పాల్గొన్నారు.

అభివృద్ధిపై కార్యదర్శులకు అవగాహన..

పాయకరావుపేట: మండలంలో గల ఆయా గ్రామాల్లో సచివాలయ సిబ్బంది చేపట్టిన పి- 4 సర్వేను పరిశీలించినట్లు ఎంపీడీవో జయప్రకాష్ రావు అన్నారు. ఆయన మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో సమావేశం ఏర్పాటు చేశారు. గ్రామాల్లో ఇంటి పన్ను వసూలు, చెత్త నుండి సంపద కేంద్రాల అభివృద్ధిపై కార్యదర్శులకు అవగాహన కల్పించారు. ఈ సమావేశంలో ఈవోఆర్‌డీ సీహెచ్ చంద్రశేఖర్, గ్రామ పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

గోవాడ సుగర్స్‌కు రూ.100 కోట్లు మంజూరు చేయాలి

మాడుగుల రూరల్ : రైతుల జీవితాలతో ఆటలాడుకుంటున్న గోవాడ సుగర్ ఫ్యాక్టరీని గాడిలో పెట్టి, కూటమి ప్రభుత్వం ఫ్యాక్టరీ సభ్య రైతులు, కార్మికులు, ఫ్యాక్టరీ అభివృద్ధికి రూ. 100 కోట్లు నిధులు మంజూరు చేయాలని మాడుగుల నియోజకవర్గ కాంగ్రెసు పార్టీ ఇన్‌చార్జి పడాల కొండలరావు డిమాండ్ చేశారు. బుధవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడారు. ఫ్యాక్టరీ పరిధిలో గల దేవరాపల్లి మండలం, కొత్తపెంటలో చెరకు రైతు తాను పండించిన పంటకు గిట్టుబాటు ధర లేక, చెరకును సకాలంలో క్రషింగ్ చేయాలేకపోయామని మనస్తాపం చెంది చెరకు తోటకు నిప్పుపెట్టిన ఘటన పట్ల ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. గోవాడ సుగర్ ఫ్యాక్టరీ పరిధిలో 23 వేల మంది రైతులు, మరో 300 మంది కార్మికులు ఆధారపడి పనిచేస్తున్నారని, క్రషింగ్‌లో సాంకేతిక లోపాల వల్ల ఒక టన్ను చెరకు 15 రోజుల పాటు కాటాల వద్ద ఎండి పోయి రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని అన్నారు. సాంకేతిక పరమైన సమస్యలకు చెక్ పెట్టాలని, తోలిన చెరకుకు సకాలంలో పేమెంట్లు ఇవ్వాలని, కార్మికులకు జీతాలు ఇవ్వాలని ఆయన ఫ్యాక్టరీ యాజమాన్యానికి విజ్ఞప్తి చేశారు.

మాలమహానాడు ఆందోళన



ధర్నా చేస్తున్న మాలమహానాడు ప్రతినిధులు

చోడవరం : ఎస్సీ వర్గీకరణ నిలిపివేయాలని కోరుతూ మాల మహానాడు ఆధ్వర్యంలో బుధవారం ఆందోళన చేశారు. చోడవరం కొత్తూరు జంక్షన్ సమీపంలో ఎమ్మెల్యే కార్యాలయం ఎదురుగా మెయిన్‌రోడ్డుపై ధర్నా చేశారు. ఎస్సీ వర్గీకరణ చేయాలని ప్రభుత్వం వన్‌మ్యాన్ కమిషన్ వేయడం దురదృష్టకరమన్నారు. వర్గీకరణ జరిగితే ప్రధానంగా మాల కులస్తులు ఎక్కువగా నష్టపోతారని, వర్గీకరణ చేయకుండా ఎస్సీలందర్నీ ఐక్యంగా ఉండేలా చూడాలని ఈ సందర్భంగా వారు నినాదాలు చేశారు. అనంతరం వినతిపత్రాన్ని ఎమ్మెల్యే కార్యాలయానికి అందజేశారు. ఆందోళనలో అనకాపల్లి జిల్లా కమిటీ అధ్యక్షుడు వేచలపు సహదేముడు, ప్రధాన కార్యదర్శి రెల్లి తాతారావు తదితరులు పాల్గొన్నారు.

నూకాలతల్లి గరగలు ఊరేగింపు

గొలుగొండ : లింగంపేట నూకాలతల్లి గరగలు (ఘటాలు) ఊరేగింపు కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఆలయ, ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో లింగంపేట నుంచి గొలుగొండ వరకు నిర్వహించిన కార్యక్రమంలో ప్రతి గ్రామంలో మహిళలు నీళ్ల బిందెలతో స్వాగతం పలికారు. ఈ ప్రాంతంలో ఇలవేల్పుగా పేరున్న లింగంపేట నూకాలమ్మతల్లి పండగ ఈనెల 28 నుంచి వారం రోజుల పాటు నిర్వహిస్తారు. ముందుగా అమ్మవారి ఘటాల ఊరేగింపు జరుగుతుంది.

తాగునీటి సమస్య పరిష్కరించాలి



నిరసనలో పాల్గొన్న సీపీఎం మండల కార్యదర్శి నరసింహమూర్తి తదితరులు

మాడుగుల : జాలంపల్లి పంచాయతీ శివారు గ్రామం సిరిపురంలో తాగునీటి సమస్య పరిష్కరించాలంటూ సీపీఎం ఆధ్వర్యంలో గిరిజన ప్రజలు బుధవారం నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా సీపీఎం మండల కార్యదర్శి నరసింహమూర్తి మాట్లాడారు. ప్రభుత్వం, అధికారులు స్పందించి గ్రామంలో ఇంటింటికీ కొళాయిలు ఏర్పాటు చేసి గిరిజన ప్రజలకు దాహం తీర్చాలని, లేదంటే ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో గ్రామానికి చెందిన చెదల రాధ, కొర్రా బీమేషమ్మ, చెదల కృష్ణ, చిత్రాల సన్యాసిరావు, కిల్లో కాంతమ్మ, కిల్లో సత్తిబాబు, కొర్రా సుందరరావు, పాల్గొన్నారు.

పరీక్ష కేంద్రం వద్ద మజ్జిగ పంపిణీ

కె.కోటపాడు : కె.కోటపాడు హైస్కూల్‌లో పదిపబ్లిక్ పరీక్ష కేంద్రం వద్ద సత్యసాయి భక్తులు మజ్జిగ చలివేంద్రం ఏర్పాటు చేశారు. వేసవి ఎండలు ఎక్కువగా ఉన్న దృష్ట్యా పరీక్ష అనంతరం విద్యార్థులు, ఉపాధ్యాయులు, పోలీస్ సిబ్బందికి సత్యసాయి భక్తులు మజ్జిగను అందించారు. మజ్జిగ పంపిణీని కె.సంతపాలెం పోస్ట్‌మాస్టర్ చల్లా సింహాద్రి నాయుడు ప్రారంభించారు. కార్యక్రమంలో సత్యసాయి సేవా సంస్థల జిల్లా అధ్యక్షుడు కశిరెడ్డి అప్పలనాయుడు, జిల్లా సేవా సహ సమన్వయకర్త అప్పలనాయుడు, కె.కోటపాడు సమితి కన్వీనర్ నారాయణపాత్రుడు పాల్గొన్నారు.

వేసవిలో పశుసంరక్షణకు జాగ్రత్తలు అవసరం



మాట్లాడుతున్న అసిస్టెంట్ డైరెక్టర్ దినేష్‌కుమార్

కె.కోటపాడు : పాడి రైతులు వేసవి కాలంలో పశుసంరక్షణలో జాగ్రత్తలు పాటించాలని, తద్వారా పశువులు వ్యాధుల బారిన పడకుండా పాల దిగుబడి తగ్గకుండా చూసుకోవచ్చని కె.కోటపాడు పశుసంవర్ధకశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ ఇ.దినేష్‌కుమార్ అన్నారు. స్థానిక పశువైద్య కేంద్రంలో బుధవారం ఆయన పాడి రైతులకు పలు సూచనలను చేశారు. ప్రస్తుతం వేసవి ఉష్ణోగ్రతలు పెరుగుతుండడం వల్ల పశువులను రైతులు ఉదయం 10 గంటలు లోగా మేతకు తీసుకువెళ్లాలని మరలా సాయంత్రం 4 గంటల తరువాత బయటకు తీసుకువెళ్లడం వల్ల వేసవి ఉష్ణోగ్రతల బారిన పశువులు పడకుండా చర్యలు తీసుకోవచ్చునని తెలిపారు. వేసవి ఉష్ణోగ్రతల కారణంగా పశువులకు నీటితో రెండు సమయాల్లోను శుభ్రపర్చాలని తెలిపారు. తద్వారా ఉష్ణోగ్రతలు తగ్గుముఖం పట్టనున్నట్టు దినేష్‌కుమార్ తెలిపారు. అలాగే పశువులను మధ్యాహ్నం సమయాల్లో గాలి, వెలుతురు తగిలే ప్రాంతాల్లోను, చెట్ల కింద ఉంచాలని ఆయన సూచించారు. ఎండ తీవ్రత దృష్ట్యా పశువులకు తాగేందుకు మంచి నీటిని అందుబాటులో ఉంచాలని సూచించారు. ఈ నెల 30 వరకూ గాలికుంటు టీకాలతో పాటు పశు బీమా కార్యక్రమాలు చేపడుతున్నామని తెలిపారు.

హెల్త్ సెక్రటరీలకు యాప్‌ల భారం తగ్గించాలి



మాట్లాడుతున్న జగన్మోహన్‌రావు

అనకాపల్లి టౌన్: హెల్త్ సెక్రటరీలకు వైద్య, ఆరోగ్యశాఖ పనులు మాత్రమే అప్పగించాలని, వీరిని పూర్తిగా వైద్య, ఆరోగ్యశాఖ పరిధిలోకి తేవాలని, యాప్‌ల భారం తగ్గించాలని తదితర డిమాండ్లతో ఈ నెల 20న విజయవాడలో జరుగుతున్న ధర్నాలో సచివాలయ హెల్త్ సెక్రటరీలందరూ పాల్గొనాలని యునైటెడ్ విలేజ్ అండ్ వార్డ్ హెల్త్ సెక్రటరీల అసోసియేషన్ రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు జగన్మోహన్ రావు కోరారు. స్థానిక సీఐటీయూ కార్యాలయంలో బుధవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ హెల్త్ సెక్రటరీలకు తీవ్రమైన పనిభారంతో పాటు యాప్ లోడింగ్, ఇతర పనులు అప్పజెప్పడంతో ఎమర్జెన్సీ వైద్య పనులకు ఆటకం కలుగుతుందన్నారు. పీహెచ్‌సీ, సీహెచ్‌సీలలో ఓపీ, నైట్ డ్యూటీలు చేయించరాదని, రెగ్యులర్ ఏఎన్ఎంలతో సమానంగా లీవులు, సౌకర్యాలు అమలు చేయాలని ఆయన తెలిపారు.

ఆదివాసీల సాగు హక్కులు కాపాడాలి



నెహ్రూచౌక్‌లో ధర్నా చేస్తున్న సీపీఎం, సీపీఐ నాయకులు

అనకాపల్లి టౌన్: గదబపాలెం ఆదివాసీల సాగు హక్కులు కాపాడాలని సీపీఐ ఎంఎల్ లిబరేషన్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి బుగత బంగారురావు డిమాండ్ చేశారు. స్థానిక నెహ్రూచౌక్ జంక్షన్‌లో బుధవారం సీపీఐ, సీపీఎం, దళిత సమన్వయ కమిటీ ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గొలుగొండ మండలం పాలమల్లంపేట గ్రామంలోని మెట్ట భూమిలో ఆదివాసీలు 50 సంవత్సరాలుగా సాగు చేసుకుంటున్నారని, ప్రస్తుత తహసీల్దార్ ఎలాంటి చట్టబద్ధమైన ప్రకియలు పాటించకుండా దేశం వదిలిపోయి అమెరికన్ పౌరుడిగా మారిపోయిన దుగ్గిరాల బాలకృష్ణ సాగు అనుభవంలో ఉన్నట్లు తప్పుడు నివేదికలు సృష్టించి భూమి రికార్డును మార్చేశారని, దీనిపై కలెక్టర్ స్వయంగా విచారణ జరపాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు రాజాన దొరబాబు, దళిత సమన్వయ కమిటీ జిల్లా కార్యదర్శి ఎగ్గాడ భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

డీఎంహెచ్‌వో ఆకస్మిక తనిఖీ



ఆరోగ్య కేంద్రం వద్ద సిబ్బందితో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో రవికుమార్

చీడికాడ: స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ రవికుమార్ బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పీహెచ్‌సీలో పోస్టుల గురించి వైద్యాధికారి సునీల్‌కుమార్‌ను అడిగి తెలుసుకున్నారు. స్టాఫ్ నర్స్, ఎంఎల్‌హెచ్‌పీ, ఇతర సిబ్బంది పోస్టులు ఖాళీలు గురించి అడిగి తెలుసుకున్నారు. పెదగోగాడ పీహెచ్‌సీలో పనిచేస్తున్న సిబ్బందిని సర్దుబాటులో భాగంగా స్టాఫ్ నర్స్‌ని ఈ పీహెచ్‌సీకి డిప్యూటేషన్ చేస్తానని హామీ ఇచ్చారు. పీహెచ్‌సీలో రోజువారీ ఓపి సంఖ్యను పెంచాలని, పీహెచ్‌సీకి వచ్చే రోగులకు ల్యాబ్‌లో పరీక్షలు నిర్వహించాలని, గ్రామాల్లో మలేరియా, డెంగ్యూ, టైఫాయిడ్, జ్వరాలు ప్రబలకుండా తగు జాగ్రతలు తీసుకోవాలని సిబ్బందిని ఆదేశించారు.

ప్రభుత్వాసుపత్రుల్లోనే ప్రసవాలు క్షేమదాయకం

కె.కోటపాడు : గర్భిణులు ప్రభుత్వాసుపత్రుల్లోనే ప్రసవించడం క్షేమదాయకమని లంకవానిపాలెం పీహెచ్‌సీ వైద్యాధికారి శైలజ అన్నారు. ఆనందపురం గ్రామంలో బుధవారం ఫ్యామిలీ ఫిజీషియన్ వైద్య పరీక్షలను ఆమె నిర్వహించారు. 79 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందించారు. గర్భిణులు, బాలింతలకు ఆరోగ్య తనిఖీలు చేశారు. పీహెచ్‌ఎన్ ప్రమీల, ఎంఎల్‌హెచ్‌పీ మంగ, ఏఎన్ఎం పద్మ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.